


# కరపత్రం

SINCE 2014

ఆదివారం జూలై 19, 2026 | సంపుటి : 2 | సంచిక : 277 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4

భారత అంతరిక్ష రంగంలో సరికొత్త అధ్యాయం

## స్కైరూట్ ఏరోస్పే 'విక్రమ్-1'

### రాకెట్ ప్రయోగం విజయవంతం



- తొలుత ఇంధన ప్రక్రియలో సాంకేతిక లోపం
- అరగంటలోపే సరిదిద్ది ప్రయోగాన్ని పూర్తి చేసిన షార్
- ప్రైవేట్ రంగంలో తొలి రాకెట్ కావడంతో సర్వత్రా హర్షం
- ప్రయోగాన్ని వీక్షించిన లోకేశ్, ఇస్రో మాజీ శాస్త్రవేత్తలు

**శ్రీహరికోట,జులై18 :**
భారత అంతరిక్ష రంగంలో సరికొత్త అధ్యాయం ప్రారంభమైంది. శ్రీహరికోట షార్ అంతరిక్ష కేంద్రం నుంచి చేపట్టిన ప్రయోగం విజయవంతం అయ్యింది. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ప్రైవేట్ స్పేస్‌టెక్ స్టార్టప్ 'స్కైరూట్ ఏరోస్పే 'విక్రమ్-1' రాకెట్ రూపొందించింది. శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం(షార్) నుంచి శనివారం మధ్యాహ్నం 12:05 గంటలకు చేపట్టిన ఈ ప్రయోగం విజయవంతమైంది. దీంతో ప్రభుత్వ ఆధ్వర్యంలోని అంతరిక్ష కార్యక్రమాలు సహా భారత ప్రైవేటు రంగం కూడా ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపగల సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటినట్లు అయ్యింది. వాస్తవానికి ఉదయం 11.30 గంటలకు ప్రయోగం జరగాల్సి ఉండగా సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో ప్రయోగానికి స్వల్ప అంతరాయం ఏర్పడింది. ఆ తర్వాత శాస్త్రవేత్తలు పరిశీలనలు చేపట్టి ఇంధన పక్రియలో తలెత్తిన సమస్యను గుర్తించి సరిచేశారు. 35 నిమిషాల తర్వాత తిరిగి రాకెట్‌ను ప్రయోగించారు. ఈ రాకెట్.. సాంకేతిక పేలోడ్‌లు సహా ప్రధాని నరేంద్ర మోదీ స్వహస్తాలతో 'వందేమాతరం' అని రాసి పంపిన ప్రత్యేక పోస్ట్‌కార్డును అంతరిక్షంలోకి తీసుకెళ్లింది. వీటితో పాటు కాస్మోస్ డైమండ్స్ సంస్థ రూపొందించిన 'కాస్మిక్ బ్లూమ్' ఆర్ట్‌వర్క్, విక్రమ్-1 రాకెట్ సూక్ష్మ ప్రతిరూపాన్నీ నింగిలోకి పంపారు. దీనిపై సర్ సీవీ రామన్, విక్రమ్ సారాభాయ్, ఏపీజే అబ్దుల్ కలాం వంటి ప్రముఖుల సూక్ష్మరూపాలను చెక్కారు. అంతేకాకుండా.. ఈ ప్రయోగం విజయవంతం కావాలని కాంక్షిస్తూ స్కైరూట్ టీమ్ సహా ఇస్రో మాజీ ఛైర్మన్లు, శాస్త్రవేత్తలు, భారతీయ వ్యోమగాములు, ఇతరులు పంపిన డజన్ల కొద్దీ చేతిరాత పోస్ట్‌కార్డులనూ ప్రత్యేక పేలోడ్ బాక్స్‌లో భద్రపరిచారు.

మిగతాద్ది 2 లో

'విక్రమ్-1' విజయవంతంపై

## ప్రధాని మోడీ హర్షం

- స్కైరూట్ ఏరోస్పేస్ బృందానికి ఫోన్‌లో అభినందనలు
- ఇంజనీర్ల కృషిని ప్రశంసిస్తూ..తనను కలవాలని సందేశం





**న్యూఢిల్లీ,జులై18 :**
భారత తొలి ప్రైవేటు అంతరిక్ష ప్రయోగం 'విక్రమ్-1' విజయవంతం కావడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ప్రయోగం విజయవంతమైన వెంటనే హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ బృందంతో ఫోన్‌లో మాట్లాడి, వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు మోదీ. ఈ ప్రయోగాన్ని తాను ప్రత్యక్షంగా వీక్షించినట్టు చెప్పిన ఆయన.. ఈ ఘనత దేశానికి గొప్ప విజయమని అభివర్ణించారు. భారత అంతరిక్ష ప్రయాణంలో ఇదో కీలక మైలురాయిగా నిలిచిందని పేర్కొన్నారు. 'ప్రయోగాన్ని నేను ప్రత్యక్షంగా వీక్షించాను. దీని వెనుక ఎందరో యువ ఇంజినీర్ల శ్రమ దాగుంది. మొత్తం బృందానికి నా హృదయపూర్వక అభినందనలు. ఇది ఆరంభం మాత్రమే. ఈ ప్రయాణాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలి' అని స్కైరూట్ టీమ్‌ను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా స్కైరూట్ ఏరోస్పేస్ శాస్త్రవేత్తలు, ఇంజినీర్ల బృందం త్వరలో తనను కలవాలని ఫోన్ ద్వారా ఆహ్వానించారు.

మిగతాద్ది 2 లో





### దేశ అంతరిక్ష కలలకు చిరునామాగా తెలంగాణ

- 'విక్రమ్-1' విజయవంతంపై రేవంత్ హర్షం

**హైదరాబాద్,జూలై18 :**
భారత్ తొలి ప్రైవేట్ అంతరిక్ష ప్రయోగం 'విక్రమ్-1' విజయవంతంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు.

2 లో



### మెజార్టీ కోసం బిజెపి అడ్డదారులు

- పార్లమెంటులో నిలదీస్తాం: పెద్దపల్లి ఎంపి వంశీకృష్ణ

**పెద్దపల్లి,జూలై18 :**
కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అయోధ్య రామమందిర నిర్మాణంలో దాదాపు 200 కోట్ల రూపాయల స్కాం జరిగిందని ఆయన ఆరోపించారు.

## ఆహార కల్తీపై ఇక ఉక్కుపాదం

- ప్రజల ప్రాణాలతో చెలగామడితే కఠిన చర్యలు
- ఆహార కల్తీ నిరోధానికి పటిష్టమైన చట్టం
- ప్రపంచ దేశాల్లో అమలవుతున్న విధానాలపై అధ్యయనం
- సేంద్రియ ఉత్పత్తుల పేరుతో విచ్చలవిడిగా అమ్మకాలు
- వాటి స్వచ్ఛతపైనా ఇకనుంచి పరిశీలిన
- అసెంబ్లీలో చర్చించి సమగ్ర చట్టం రూపకల్పన
- ఉన్నతస్థాయి సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశం

2లో..



## ఆయిల్ పామ్ కోసం ఏకమవుదాం

» కేంద్రంపై ఒత్తిడి పెంచుదాం రండి

» దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయమంత్రులకు తుమ్మల లేఖ



**హైదరాబాద్,జూలై18 :**
కేంద్రంపై ఉమ్మడిగా ఒత్తిడికి దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ మంత్రులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ రాశారు. ఆయిల్ పామ్ రైతుల కోసం దక్షిణాది రాష్ట్రాలు ఏకమవ్వాలని కోరారు. ప్రధాని మోదీని కలిసి ఆయిల్ పామ్ రైతుల సమస్యలు వినిపిద్దామన్నారు. ఆయిల్ పామ్‌కు కనీస హామీ ధర రూ.25 వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. లేదంటే క్రూడ్ పామ్ ఆయిల్ దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పునరుద్ధరించాలన్నారు. దిగుమతి సుంకాల తగ్గింపుతో రైతులకు భారీ నష్టం వాటిల్లుతోందని మంత్రి తెలిపారు.

మిగతాద్ది 2 లో

## స్థానిక ఉత్పత్తులను ప్రజలు ఆదరించాలి

- 16 నుండి 26 వరకు 'బోనాలు- చేతివృత్తుల మేళా'
- ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రదర్శనలు
- మంత్రి పొన్నం ప్రభాకర్









**హైదరాబాద్,జూలై18 :**
చేతి వృత్తి కళాకారులకు చేయూతనివ్వాలని రాష్ట్ర ప్రభుత్వ బిసి సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 'బోనాలు- చేతివృత్తుల మేళా, బిసి చేతివృత్తుల అమ్మకాలు- ప్రదర్శన'ను ఈనెల 16వ తేదీ నుండి 26 వరకు ట్యాంక్ బండ్, అంబేద్కర్ విగ్రహము ప్రక్కన గల గ్రౌండ్స్ లో నిర్వహిస్తోంది. చేతివృత్తుల కళాకారులచే తయారు చేసిన వివిధ వస్తువుల ప్రదర్శన, విక్రయము విజయవంతంగా కొనసాగుతున్నది.

మిగతాద్ది 2 లో

## భాజపా నేతల్లో ఎలాంటి విభేదాలు లేవు

- అందరం కలసి అధికారం కోసం కృషి చేస్తున్నాం
- బండి సంజయ్, ఈటెల మధ్య సయోధ్యకు యత్నం
- ఎంపి లక్ష్మణ్ నివాసంలో ఇద్దరు నేతలతో అభయ్ పాటిల్ చర్చలు
- తెలంగాణలో అధికారం బిజెపిదేనన్న ఎంపి లక్ష్మణ్



2లో..

## లక్షల ఉద్యోగాల హామీ ఏమయ్యింది

» జాబ్ క్యాలెండర్, రెండు లక్షల ఉద్యోగాలు ఏవీ
» కొలువుల కుంభమేళా కాదు.. కుంభకోణాల కుంభమేళా
» ఢిల్లీలో రాహుల్ గాంధీ జేబులు నిండుతున్నాయి
» తెలంగాణలో లూటీ జరుగుతోంది
» మొహబ్బత్‌కి దుకాణ్ కాదు.. ధోకేకా మకాన్ నడుస్తోంది
» చాయ్ పే చర్చాను మరచిన రాహుల్
» బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సులో కేటీఆర్ ఘాటు విమర్శలు

2లో..





**హైదరాబాద్,జూలై18 :**
ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలిస్తానని రాహుల్ గాంధీ ఇచ్చిన మాట తప్పారని కేటీఆర్ తెలిపారు. రాహుల్ గాంధీకి తెలుగు రాదు.. మన బాధ తెల్వదు అని అన్నారు. అశోక్‌నగర్‌లో చాయ్‌పే చర్చా పెట్టింది అసలు రాహుల్‌గాంధీకి గుర్తుందా అని ప్రశ్నించారు.



## 21న బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణోత్సవం

- ఏర్పాట్లపై అధికారులతో తలసాని సమీక్ష

**హైదరాబాద్,జూలై18 :**
ఈ నెల 21న నిర్వహించనున్న బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణం, 22న జరగనున్న రథోత్సవం సందర్భంగా అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు.

2లో..

## ఎల్‌నినో ప్రభావాన్ని అంచనా వేసేందుకు నిపుణుల కమిటీ

**హైదరాబాద్:**
ఎల్‌నినో ప్రభావాన్ని అంచనా వేసేందుకు తెలంగాణ ప్రభుత్వం (TG Govt) నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అధ్యక్షుడిగా, అధికారులు, శాస్త్రవేత్తలు, నిపుణులు సభ్యులుగా వ్యవహరించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం జీవో జారీ చేసింది. రాష్ట్రస్థాయి ప్రణాళిక, తీసుకోవాల్సిన చర్యలను ఈ కమిటీ సిఫార్సు చేయనుంది. మరోవైపు ధరణి లావాదేవీలపై సమగ్ర విచారణ జరపాలని రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయించింది. వివిధ శాఖల అధికారులు, నిపుణులతో సిట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

# మెజార్టీ కోసం బిజెపి అడ్డదారులు

మొదటిపేజీ తరువాయి

దేవుడి పేరుతో, రాముడి పేరుతో బీజేపీ దిగజారుడు రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. పార్లమెంట్‌లో మద్దతు కూడబెట్టుకోవడానికి, టూ–థర్డ్ మెజారిటీ సాధించడం కోసం బీజేపీ అడ్డదారులు తొక్కుతోందని.. అందులో భాగంగానే టీఎంసీ ఎంపీలను కొనుగోలు చేస్తోందని ధ్వజమెత్తారు. ఏసీబీ, సీబీఐ సంస్థలను అడ్డం పెట్టుకుని ప్రతిపక్ష నాయకులను బెదిరింపులకు గురిచేస్తోందని విమర్శించారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాల్లో తాము గట్టిగా గళం విప్పుతామని... తెలంగాణకు రావాల్సిన నిధులు, హక్కుల సాధన కోసం పోరాటం చేస్తామని ఎంపీ వంశీకృష్ణ స్పష్టం చేశారు. ధర్మపురి, కోటిలింగాల పుణ్యక్షేత్రాలకు ఎంతో గొప్ప చరిత్ర ఉందని పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ అన్నారు. రాబోయే రోజుల్లో ఈ ఆలయాలను టెంపుల్ సిటీగా మార్చి, అద్భుతమైన టూరిస్ట్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు తన వంతు పూర్తి కృషి చేస్తానని రైతులకు, ప్రజలకు భరోసా ఇచ్చారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలో ఎంపీ గడ్డం వంశీకృష్ణ విస్తృతంగా పర్యటించారు. మండల పరిధిలో సుమారు 20 లక్షల రూపాయల నిధులతో చేపట్టనున్న పలు బోర్లు, సీసీ డ్రైనేజీ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.

# భాజపా నేతల్లో ఎలాంటి విభేదాలు లేవు

హైదరాబాద్,జూలై18 : తెలంగాణ భాజపా నేతల్లో ఎలాంటి విభేదాలు లేవని, అందరం కలసి అధికారం కోసం కృషి చేస్తున్నామని బిజెపి ఎంపి లక్ష్మణ్ అన్నారు. బండి సంజయ్, ఈటెల రాజేందర్ మధ్య ఉన్న విభేదాలపై ఆయన స్పందించారు. కీలక నేతల మధ్య విభేదాలపై అధిష్ఠానం దృష్టి సారించింది. కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ తో ఆ పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ అభయ్ పాటిల్ భేటీ అయ్యారు. ఎంపీ లక్ష్మణ్ నివాసంలో ఇరువురు నేతలతో గంట పాటు సమావేశం జరిగింది. పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలని అభయ్ పాటిల్ వారికి సూచించారు. కరీంనగర్ నియోజకవర్గానికి సంబంధించిన అంశాల్లో ఇద్దరూ కలిసి పని చేయాలని, ఏమైనా సమస్యలు ఉంటే.. అంతర్గతంగా పరిష్కరించుకోవాలని ఆదేశించారు. అనంతరం ఇరువురు నేతలతో కలిసి ఎంపీ లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో భాజపాను అధికారంలోకి తీసుకురావడంపై చర్చించినట్లు తెలిపారు. ప్రజలకు కాంగ్రెస్‌పై కోపం ఉందని, అలాగే బీఆర్ఎస్‌పై నమ్మకం లేదని తెలిపారు. వచ్చే ఎన్నికల నాటికి అసెంబ్లీ, లోక్‌సభ సీట్లు పెరుగుతాయని, జమిలి ఎన్నికలు జరుగుతాయన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. భాజపాను అధికారంలోకి తెచ్చేందుకు తామంతా కలిసి పనిచేస్తామని వివరించారు. తెలంగాణలో అధికారంలోకి రావాలనే పట్టుదలతో ఉన్న బీజేపీ.. ఆ దిశగా అడుగులు వేస్తోందన్నారు. ఈ క్రమంలోనే నేతల మధ్య విభేదాలను తొలగించి.. అందరినీ ఒక తాటిపైకి తీసుకురావాలని ప్లాన్ చేస్తోంది. ఎంతో కాలంగా విభేదాలతో ఎడమొహం పెడమొహంగా ఉంటున్న కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ మధ్య సయోధ్య కుదిర్చారు. వీరిద్దరి మధ్య రాజీ కుదిర్చేందుకు రంగంలోకి దిగిన బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి అభయ్ పాటిల్.. నేడు ఈటల రాజేందర్, బండి సంజయ్‌తో సమావేశం నిర్వహించారు. ఎంపీ లక్ష్మణ్ నివాసం వేదికగా జరిగిన ఈ సమావేశంలో ఈటల, బండి మధ్య రాజీ కుదిర్చారు. విభేదాలు పక్కనపెట్టి.. తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చే దిశగా కృషి చేయాలని ఇద్దరు నేతలకు అభయ్ పాటిల్ దిశానిర్దేశం చేశారు. భేటీ అనంతరం మీడియా ముందుకు బీజేపీ నేతలు.. తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవన్నారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బీజేపీనే అని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ తీరుతో ప్రజలు విసిగిపోయారన్నారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చలేదని, కాంట్రాక్టర్లు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఏర్పడిందంటూ ఎంపీ లక్ష్మణ్ మండిపడ్డారు. తెలంగాణ అభివృద్ధిపై మోదీ ప్రత్యేక చొరవ చూపారని, వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీదే అధికారమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# స్కైరూట్ ఏరోస్పే 'విక్రమ్–1'

## రాకెట్ ప్రయోగం విజయవంతం

మొదటిపేజీ తరువాయి

స్కైరూట్ సంస్థ 'మిషన్ ఆగమన్' పేరిట ఈ ప్రయోగం చేపట్టింది. భారత ప్రైవేట్ అంతరిక్ష రంగం ఆర్బిటాల్ ప్రయోగాల యుగంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఈ మిషన్‌కు ఆ పేరు పెట్టింది. విక్రమ్–1 ద్వారా గ్రహాస్పేస్, కాస్మోసెర్వ్, డీక్యూబ్‌డ్ సంస్థలకు చెందిన టెక్నాలజీ డెమానిస్ట్రేషన్ పేలోడ్‌లు సహా స్కైరూట్‌కు చెందిన 'స్కోప్'ను కూడా అంతరిక్షంలోకి పంపారు. ఈ ప్రయోగం ద్వారా రాకెట్‌లోని ప్రొపల్షన్, స్టేజ్ సెపరేషన్, గైడెన్స్, నావిగేషన్, కంట్రోల్ వ్యవస్థల పనితీరును అంతరిక్ష ప్రయాణంలో పరీక్షించి తద్వారా కీలక సమాచారం రాబట్టనున్నారు. దీంతో రానున్న కాలంలో వాణిజ్య ప్రయోగాల అవసరాలకు సాంకేతిక సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవడమే లక్ష్యంగా స్కైరూట్ ముందడుగేస్తోంది.ఇక.. సుమారు ఏడంతస్తుల భవనం ఎత్తులో రూపొందిన విక్రమ్–1 పూర్తిగా కార్బన్ కాంపోజిట్ నిర్మాణంతో తయారైంది. దేశీయంగా అభివృద్ధి చేసిన 3డీ ప్రింటెడ్ ఇంజిన్లు, ఘన ఇంధన బూస్టర్లతో పనిచేసే ఈ రాకెట్ 350 కిలోల వరకు చిన్న ఉపగ్రహాలను 450 కిలోమీటర్ల ఎత్తులోని లోఎర్త్ ఆర్బిట్ లో ప్రవేశపెట్టే సామర్థ్యాన్ని కలిగి ఉంది. 2022లో విక్రమ్–ఎస్ ద్వారా తొలి ప్రైవేట్ రాకెట్‌ను విజయవంతంగా కక్ష్యలోకి పంపిన స్కైరూట్.. ఇప్పుడు విక్రమ్–1తో తొలి దేశీయ ప్రైవేట్ ఆర్బిటాల్ ప్రయోగం చేపట్టింది. ఈ ప్రయోగాన్ని ఏపీ మంత్రి నారా లోకేశ్ ప్రత్యక్షంగా వీక్షించారు. కుమారుడు దేవాన్ష్‌తో కలిసి శ్రీహరికోటకు వెళ్లిన లోకేశ్.. ఇస్రో గ్యాలరీ నుంచి 'విక్రమ్–1' ప్రయోగాన్ని వీక్షించారు.

ఇస్రో మాజీ ఛైర్మన్లు, సీనియర్ శాస్త్రవేత్తలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# లక్షల ఉద్యోగాల హామీ ఏమయ్యింది

మొదటిపేజీ తరువాయి

యువత తలరాత మారుస్తానని అబద్ధపు హామీలు ఇచ్చారని.. జాబ్ క్యాలెండర్, రెండు లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయని నిలదీశారు. డిగ్రీ విద్యార్థినులకు స్కూటీలు ఏమయ్యాయి? విద్యా భరోసా ఏమైందని అడిగారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ జేబులు నిండుతున్నాయని.. తెలంగాణలో లూటీ జరుగుతోందని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణలో మొహబ్బత్‌కి దుకాణ్ కాదు.. ధోకేకా మకాన్ నడుస్తోందని ఆరోపించారు. కొలువుల కుంభమేళా అని చెప్పి.. కుంభకోణాల కుంభమేళా చేస్తున్నారని మండిడ్డారు. హైదరాబాద్ సరూర్‌నగర్‌లో బీఆర్ఎస్ తలపెట్టిన యువ సంగ్రామ సదస్సులో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఉద్యోగాలు అడిగితే ఉరికించి కొడుతున్నారని కాంగ్రెస్ సర్కార్‌పై కేటీఆర్ మండిపడ్డారు. డిసెంబర్ 9 నుంచి ఉద్యోగ పర్వం కాదు.. ఉన్మాదపర్వం చూపిస్తున్నారని అన్నారు. నిరుద్యోగుల పట్ల దౌర్జన్య కాండ కొనసాగుతోందని తెలిపారు. రాహుల్ గాంధీకి నిరుద్యోగుల ఆక్రోశం కనబడటం లేదా అని నిలదీశారు. నిరుద్యోగ అభ్యర్థుల శోకాలు వినిపించడం లేదా అని ప్రశ్నించారు. సిటీ సెంట్రల్ లైబ్రరీలో దాడులు, ఓయూలో నిర్బంధాలు కనిపించడం లేదా అని అడిగారు. ఢిల్లీలో రాజ్యాంగం చేత పట్టుకుని రాహుల్ గాంధీ సుద్దపూస మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. హైదరాబాద్ నడిబొడ్డున ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుంటే పట్టించుకునే వారే లేరని కేటీఆర్ మండిపడ్డారు. రాహుల్ గాంధీ ప్రధాని అయ్యే వరకు వదిలిపెట్టనని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నాడని తెలిపారు. నవంబర్ 22న అవినీతి సొమ్ముతో జాబ్ క్యాలెండర్‌పై యాడ్‌లు వేశారని గుర్తుచేశారు. కానీ ఇవాళ జాబులు లేవు.. జవాబులు లేవని విమర్శించారు. ఉద్యోగాలు లేవు.. క్యాలెండర్ మారినా.. జాబ్ క్యాలెండర్‌కు దిక్కు లేదని అన్నారు. అసెంబ్లీలో ప్రకటించిన జాబ్ క్యాలెండర్ చిత్తు కాగితాలుగా మారిందని విమర్శించారు. చరిత్రను మరిచిపోతే భవిష్యత్ తరాలు క్షమించవని హెచ్చరించారు. చరిత్రలు, ఇతిహాసాలు, పురాణాలు చదవాలని సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ సూచించారు. తెలంగాణ ఉద్యమాల్లో చావగొట్టిన వాళ్లే మళ్లీ అధికారంలోకి వస్తారని తెలిపారు. కాంగ్రెస్ అలవిగాని హామీలు నమ్మి తెలంగాణ యువత మోసపోయింద్రు అని తెలిపారు. 1952, 1969లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ యువత గుండెల్లో గుణపాలు నింపిందని గుర్తుచేశారు. వేలమంది యువత ప్రాణాలు తీసుకున్నా కాంగ్రెస్‌కు రక్తదాహం తీరడం లేదని అన్నారు. మన రక్తం పొలాల మీద చల్లాలని చిల్లరమాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రైతు, యూత్, మహిళ, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌పై కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చిందని తెలిపారు. ఓటు కోసం కోటి మోసాలు చేస్తున్న కాంగ్రెస్ తీరు దేశానికి తెలియాలన్నారు. రేపటి తెలంగాణ నిర్మాతలు మీరు.. భవిష్యత్ నిర్ణేతలు మీరే అని యువతను ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అలాంటి యువతను కాంగ్రెస్ సర్కార్ మోసం చేస్తున్నదని మండిపడ్డారు. మీకు జరిగిన మోసం, వంచనను గుర్తుచేసుకుని కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సరిగ్గా 38 నెలల కింద ఇదే సరూర్ నగర్ స్టేడియం సాక్షిగా తెలంగాణ యువత దగా పడిందని తెలిపారు. నిరుద్యోగులను వంచించిన దగాకోరులు కాంగ్రెస్ నాయకులు అని పేర్కొన్నారు. హైకమాండ్ తరలివచ్చి మాయామశ్చీంద్ర కార్యక్రమం ఇక్కడ చేశారని ఎద్దేవా చేశారు. యూత్ డిక్లరేషన్ పేరిట దుర్మార్గమైన వాగ్దానాల వరద పాటించారని మండిపడ్డారు. పాత కేటుగాళ్లు.. కొత్త డూప్లికేట్లు వచ్చి యువతపై లేని ప్రేమను కనబరిచారని తెలిపారు. యూత్‌కు ఇచ్చిన ఒక్క హామీ అయినా నెరవేర్చారా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాలు ఇచ్చారా అని నిలదీశారు. ప్రైవేటు కంపెనీల్లో 75 శాతం రిజర్వేషన్ వచ్చిందా అని అడిగారు. కాలేజీ విద్యార్థినులకు స్కూటీలు వచ్చాయా? యువతకు రూ.10లక్షల రుణాలు వచ్చాయా? ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వచ్చాయా? అని ప్రశ్నించారు. నాలుగు ట్రిపుల్‌ఐటీలు, మూడు యూనివర్సిటీలు వచ్చాయా? నెలకు రూ.4వేల భృతి వచ్చిందా? పదో తరగతిలో రూ.10వేలు, ఇంటర్ పాసైతే రూ.15వేలు వచ్చాయా? డిగ్రీ ఉత్తీర్ణులతై లక్ష వచ్చాయా? పీహెచ్‌డీ పాసైతే రూ.5లక్షలు వచ్చాయా? అని ప్రశ్నించారు. ఇంత మోసానికి పాల్పడిన వారిని ఏమనాలో ఆలోచించాలని సూచించారు. దగుల్బాజీలా.. దోకేబాజ్‌లు అనాలో మీరే ఆలోచించాలన్నారు. జిత్తులమారి ముసలి నక్క కాంగ్రెస్ యువజనాన్ని తెలివిగా చిత్తు చేసిందని కేటీఆర్ విమర్శించారు. 60 ఏళ్లు నెత్తురు మరిగిన కాంగ్రెస్ యువతను ఎలా మోసం చేసిందో గుర్తించాలన్నారు. కాంగ్రెస్ మోసపు వలలో పడిపోయి గోసపడుతున్నారని తెలిపారు. 31 నెలలు గడిచాయి.. నిరుద్యోగులకు కాంగ్రెస్ ఏం చేసిందని ప్రశ్నించారు. మాటతప్పి వంచించి, నమ్మించి నట్టేట ముంచి అధికారంలోకి వచ్చిందని కాంగ్రెస్‌పై మండిపడ్డారు. యువతరంతో పెట్టుకుంటే కొన్ని తరాలు పుట్టగతులు ఉండవని హెచ్చరించారు.

## 'విక్రమ్-1' విజయవంతంపై

# ప్రధాని మోడీ హర్షం

మొదటిపేజీ తరువాయి

అంతరిక్ష రంగంలో భారత్ స్వావలంబన దిశగా వేగంగా ముందుకు సాగుతోందని ఈ ప్రయోగం ప్రపంచానికి చాటిచెప్పిందని మోదీ అభిప్రాయపడ్డారు. 'అంతరిక్ష రంగంలోనూ భారత్ ఆత్మనిర్భర్‌గా ఎదగగలదని మీరు ప్రపంచానికి నిరూపించారు' అని ప్రధాని కొనియాడారు. 'విక్రమ్–1'లో తన 'వందేమాతరం' సందేశంతో కూడిన కార్డును కూడా పంపించిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన శుభాకాంక్షలు సహా ఆ సందేశం కూడా అంతరిక్షంలోకి చేరడం గర్వకారణమన్నారు. 'ఈ ప్రయోగం ద్వారా 'వందేమాతరం' సందేశం మరింత ఉన్నత స్థాయికి చేరి అంతరిక్షంలోనూ మార్మోగింది' అని మోదీ వ్యాఖ్యానించారు. శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం నుంచి శనివారం మధ్యాహ్నం 12:05 గంటలకు 'మిషన్ ఆగమన్' పేరిట చేపట్టిన 'విక్రమ్–1' రాకెట్ విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లింది. నిర్ణీత సమయం కంటే 35 నిమిషాలు ఆలస్యంగా ప్రయోగం చేపట్టినప్పటికీ.. అన్ని దశలను విజయవంతంగా పూర్తి చేయడంతో భారత ప్రైవేటు అంతరిక్ష రంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలికింది.

# ఆహార కల్తీపై ఇక ఉక్కుపాదం

మొదటిపేజీ తరువాయి

ఆహార, ఔషధాల కల్తీని నిరోధించేందుకు కఠిన చట్టం రూపొందించాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. కూరగాయలు, పండ్లు, పాలు, ఆహార పదార్థాల కల్తీ వల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని అన్నారు. ఆహార, ఔషధ కల్తీ నియంత్రణపై మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఆకుకూరలు, కూరగాయలు, పాలు ఎక్కువ రోజులు నిల్వ ఉంచేందుకు.. పండ్లు త్వరగా మగ్గేందుకు విచ్చలవిడిగా రసాయనాలు వాడుతుండటంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఎరువులు, పురుగు మందులు ఎక్కువగా వాడటంతో పంట ఉత్పత్తుల్లోనూ రసాయన అవశేషాలు బయటపడి దిగుమతి చేసుకోవడానికి విదేశాలు నిరాకరిస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. మార్కెట్‌లో సేంద్రియ ఉత్పత్తుల పేరుతో భారీ ధరలకు అమ్ముతున్నారని, అవి సేంద్రియ ఉత్పత్తులేనని నిర్ధరించేందుకు సరైన వ్యవస్థలు లేవన్నారు. ఈ నేపథ్యంలో కల్తీల నిరోధానికి సమగ్ర చట్టాలు ఉన్న దేశాలకు వెళ్లి అక్కడి విధానాలను అధ్యయనం చేసి సమగ్ర నివేదిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. బిల్లు రూపొందించి శాసనసభలో సమగ్రంగా చర్చించడంతో పాటు.. ప్రజల అభిప్రాయాలు స్వీకరించనున్నట్లు తెలిపారు. కల్తీలకు సంబంధించి సమాచార సేకరణకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని చెప్పారు. కల్తీల నిరోధానికి సంబంధించి ముందుగా క్యూర్ ప్రాంతాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకోవాలని సూచించారు. పైలట్ ప్రాజెక్టులో వచ్చే లోటుపాట్ల ఆధారంగా ముందుకు సాగాలని సీఎం దిశానిర్దేశర చేశారు. ఈ క్రమంలో తెలంగాణలో ఆహార, ఔషధ కల్తీలను పూర్తిగా అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కఠిన చట్టాన్ని తీసుకురావాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో కల్తీల నియంత్రణపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కల్తీ ఆహారం, నకిలీ ఔషధాల వల్ల ప్రజల ఆరోగ్యం తీవ్ర ప్రమాదంలో పడుతోందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కల్తీకి సంబంధించిన సమాచారాన్ని ప్రజలు నేరుగా ప్రభుత్వానికి చేరవేసేలా ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే అక్రమాలను వెలుగులోకి తీసుకొచ్చే విజిల్ బ్లోయర్ల వ్యవస్థను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. తెలంగాణ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ అథారిటీ చట్టంపై అసెంబ్లీలో సమగ్ర చర్చ నిర్వహించి, ప్రజల అభిప్రాయాలను సేకరించిన అనంతరం బిల్లుకు తుది రూపం ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు. కల్తీల నియంత్రణలో ప్రపంచంలోని వివిధ దేశాల్లో అమలవుతున్న చట్టాలు, విధానాలను అధ్యయనం చేసి వాటిలో ఉత్తమ పద్ధతులను తెలంగాణలో అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. తొలి దశలో 'క్యూర్' ప్రాంతంలో పైలట్ ప్రాజెక్టుగా ఈ వ్యవస్థను అమలు చేసి, అనంతరం రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నట్లు తెలిపింది. సేంద్రియ ఉత్పత్తుల ధృవీకరణకు ప్రత్యేక వ్యవస్థను రూపొందించడంపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. రసాయన అవశేషాలు, కల్తీ కారణంగా వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులపై ప్రతికూల ప్రభావం పడుతోందని సీఎం పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, కల్తీలకు పాల్పడే వారిపై ఇకపై ఎలాంటి రాజీ లేకుండా

కఠిన చర్యలు తీసుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ సమీక్షలో డిజిపి ఆనంద్, సిఎస్ సంజయ్ జాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ కోసం ఏకమవుదాం

మొదటిపేజీ తరువాయి

దేశ ఆయిల్ పామ్ సాగులో 75 శాతం వాటా దక్షిణాది రాష్ట్రాలదే అని చెప్పుకొచ్చారు. రైతులకు స్థిర ఆదాయం కోసం కేంద్రం తక్షణ జోక్యం అవసరమన్నారు. వంటనూనెల స్వయం సమృద్ధి లక్ష్యానికి రైతుల రక్షణ కీలకమన్నారు. ఆయిల్ పామ్ రైతుల ప్రయోజనాల కోసం దక్షిణాది రాష్ట్రాలు కలిసిరావాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.

# స్థానిక ఉత్పత్తులను ప్రజలు ఆదరించాలి

మొదటిపేజీ తరువాయి

ఈ ప్రదర్శనలో కుమ్మరులు వారు తయారు చేసిన మట్టిపాత్రలు, గౌడన్నల 'నీరా' స్టాల్, మేదరివారు తయారు చేసిన వెదురు వస్తువులు,హ్యాండ్ లూమ్స్ పోచంపల్లి–ఇక్కత్, గద్వాల్ – నారాయణపేట్, పూసలవారి సామగ్రి, మహిళా స్వయం సహాయక సంఘాల స్వగృహ ఫుడ్స్, ఇతర బిసి వర్గాలచే తయారు చేయబడిన వస్తువులు, తెలంగాణ వంటకాలు, మత్స్య కారుల తయారు చేయబడే చేప వంటకాలు, ఇతర భోజన స్టాల్స్ సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ ప్రదర్శనలో లభించే వస్తువులు వినియోగదారులకు, సందర్శకులకు సరసమైన ధరలలో లభ్యమవుతున్నాయి. ఈ ప్రదర్శన ప్రతిరోజు ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 10:00 గంటల వరకు కొనసాగుతున్నది. ప్రభుత్వం సందర్శకులకు ప్రవేశము ఉచితంగా కల్పిస్తున్నది. ప్రదర్శనలో వివిధ రంగాలకు చెందిన 60 స్టాల్స్ ఏర్పాటు చేశారు. ప్రజల నుంచి వస్తున్న విశేష ఆదరణతో స్టాల్స్ నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చేనేత, హస్తకళలు, మట్టి కళలు, చెక్క బొమ్మలు వంటి సంప్రదాయ కళలను ప్రోత్సహించడ మే ఈ మేళా ప్రధాన లక్ష్యమని, గ్రామీణ కళాకారుల ప్రతిభకు మార్కెట్ కల్పిస్తూ వారి జీవనోపాధిని బలోపేతం చేయడంలో ఇటువంటి మేళాలు కీలక పాత్ర పోషిస్తాయని రాష్ట్ర బిసి సంక్షేమశాఖ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. 'వోకల్ ఫర్ లోకల్' భావనకు అనుగుణంగా స్థానిక ఉత్పత్తులను ప్రజలు ఆదరించాలని, సాంప్రదాయ కళలను నేటి తరానికి పరిచయం చేసి, భావితరాలకు అందించడం మన అందరి బాధ్యత అని ఆయన తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కళాకారుల సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి, మార్కెటింగ్ అవకాశాల విస్తరణకు కట్టుబడి ఉందన్నారు. మేళాలో పాల్గొన్న ప్రతి కళాకారుడికి అభినందనలు తెలియజేస్తూ, ప్రజలు పెద్ద ఎత్తున సందర్శించి హస్తకళ ఉత్పత్తులను కొనుగోలు చేసి కళాకారులను ప్రోత్సహించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. మన కళలు, మన చేతివృత్తులు? మన సంపద అనే భావనతో ప్రతి ఒక్కరూ ఈ మేళాను విజయవంతం చేయాలన్నారు. బోనాల పండుగకు అవసరమైన బోనం కుండలతో పాటు సంప్రదాయ ఆచారాలకు ఉపయోగించే వివిధ రకాల వస్తువులను ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానంలో అంతర్భాగమైన అనేక కులవృత్తులు కనుమరుగు అవ్వకుండా మరింతగా ప్రోత్సహించెందుకు ప్రభుత్వం ప్రదర్శనను ఏర్పాటు చేసింది.

# దేశ అంతరిక్ష కలలకు చిరునామాగా తెలంగాణ

మొదటిపేజీ తరువాయి

'హైదరాబాద్ రైజింగ్.. తెలంగాణ రైజింగ్' అంటూ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా హర్షం వ్యక్తం చేశారు. భారత్ తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్ 'విక్రమ్–1' విజయవంతమైన ప్రయోగమన్నారు. శ్రీహరికోట నుంచి విక్రమ్–1 నింగిలోకి దూసుకెళ్లిందని, హైదరాబాద్ సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్ ఘన విజయం సాధించిందని తెలిపారు. భారత అంతరిక్ష రంగం మరో చారిత్రక మైలురాయిని చేరుకుందన్నారు. దేశ అంతరిక్ష కలలకు చిరునామాగా తెలంగాణ నిలిచిందని సీఎం అన్నారు. హైదరాబాద్ ఇన్నోవేషన్ శక్తికి ప్రపంచ వేదికపై గుర్తింపు లభించిందని తెలిపారు. ఈ సందర్భంగా స్కైరూట్ బృందానికి ముఖ్యమంత్రి అభినందనలు తెలియజేశారు. విక్రమ్–1.. ప్రైవేట్ స్పేస్ రంగంలో భారత్ సత్తా చాటిందని కొనియాడారు. భవిష్యత్తు అంతరిక్ష ప్రయాణాలకు తెలంగాణ నుంచి బలమైన అడుగు పడిందని ఎక్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి పోస్ట్ చేశారు.

# 21న బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణోత్సవం

మొదటిపేజీ తరువాయి

శనివారం బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఏర్పాట్లపై చర్చించారు. ఈ వేడుకలకు మన రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు తరలివస్తారని వెల్లడించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లను చేపట్టాలని సూచించారు. ప్రజలు సంతోషంగా జరుపుకునే వేడుకకు ఆంక్షలు పెట్టి ఇబ్బందులు పెట్టొద్దని అధికారులకు స్పష్టం చేశారు. ఆలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక అదనపు పారిశుద్ధ్య సిబ్బందిని నియమించాలని, నిరంతర పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు. భక్తులు తోపులాటకు గురికాకుండా పటిష్టమైన బారికేడ్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రథోత్సవం సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆలయ పరిసరాలలో ప్రత్యేక హెల్త్ క్యాంప్ లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడి కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత బల్కంపేట ఎల్లమ్మ ఆలయాన్ని ఎంతో అభివృద్ధి చేశామని తెలిపారు. ఈ సమావేశంలో ఆలయ ఈవో వినోద్ రెడ్డి, డీసీ సుజాత, వాటర్ వర్క్స్ జీఎం సతీష్, ఎలక్ట్రికల్ డీఈ కిషోర్, ఆర్ అండ్ బి డీఈ మనోహర్, లా అండ్ ఆర్డర్ సీఐ శ్రీనివాస్ రెడ్డి, ట్రాఫిక్ సీఐ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఘటనపై ఎస్పీతో ఆరా తీసిన హోంమంత్రి

గుంటూరులో మహిళను వివస్త్రను చేసి దాడికి పాల్పడ్డ ఘటనపై హోం మంత్రి వంగలపూడి అనిత ఆగ్రహం వ్యక్తంచేశారు. ఘటనపై జిల్లా ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. బాధ్యులపై చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. విచారణలో నిర్లక్ష్యం వహించిన పోలీసులపైనా చర్యలకు హోం మంత్రి ఆదేశించారు. ఘటన జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడంలో సీఐ ఎందుకు తాత్సారం చేశారని ప్రశ్నించారు. ఆడబిడ్డల జోలికి వస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించారాదని స్పష్టం చేశారు. నేరస్థుల్ని నేరస్థులుగానే చూడాలి తప్ప పార్టీల పరంగా చూడరాదని తేల్చి చెప్పారు.

# మహిళల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- మహిళల సాధికారత, ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం పెద్దపీట -- 'రైజ్ హర్--2026' సదస్సులో పిలుపు
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య






**కరపత్రం ప్రతినిది బ్యూరో, జూలై 18**

మహిళల సంక్షేమం, సాధికారత, ఆర్థిక స్వావలంబనకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. హైదరాబాద్‌లోని రెడ్ హిల్స్‌లో తెలంగాణ ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వాణిజ్య మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన 'రైజ్ హర్--2026' మహిళా సాధికారత సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

ఈ సందర్భంగా డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి తమ ప్రతిభను అన్ని రంగాల్లో చాటుకోవాలని పిలుపునిచ్చారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సూచించిన 'సమాజానికి తిరిగి సేవ చేయాలి' అనే స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షిస్తూ జాతీయ గౌరవాన్ని పెంపొందించే బాధ్యత ప్రతి పౌరుడిపైనా ఉందన్నారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించి అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేస్తూ మహిళల్లో పొదుపు, స్వయం ఉపాధి, పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహిస్తోందని తెలిపారు.

ప్రతి ఒక్కరూ జీవితాంతం నేర్చుకునే విద్యార్థులుగా ఉండాలని, ముఖ్యంగా ఎస్సీ మహిళలు విద్య, ఉద్యోగం, వ్యాపారం, నాయకత్వ రంగాల్లో మరింత ముందుకు వచ్చి సమాజాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా, సామాజికంగా మరింత బలోపేతం కావాలని సూచించారు. మహిళల అభివృద్ధితోనే కుటుంబం, సమాజం, రాష్ట్రం సమగ్ర అభివృద్ధి సాధిస్తాయని ఆమె అన్నారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, పరిశ్రమలు--వాణిజ్య శాఖ అదనపు సంచాలకుడు శ్రీనివాస్ నాయక్, ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం అధికారి రవి, భారతీయ స్టేట్ బ్యాంకు లీడ్ జిల్లా మేనేజర్ మూర్తి, వీ-హబ్ డైరెక్టర్ జావేద్ అక్తర్ షేక్, తెలంగాణ ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వాణిజ్య మండలి అధ్యక్షుడు నల్ల బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను మరో రెండు నెలలు పొడిగించాలి

- ప్రతి అర్హ ఓటరు తప్పనిసరిగా ప్రక్రియలో పాల్గొని ఓటు హక్కును కాపాడుకోవాలి
- అర్హుల ఓట్లు తొలగించకుండా ఎన్నికల సంఘం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి
- బీకేఎంయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు



**కరపత్రం ప్రతినిది బ్యూరో, జూలై 18**

కేంద్ర ఎన్నికల సంఘం తెలంగాణలో చేపడుతున్న ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ప్రస్తుత గడువుతో ముగించకుండా మరో రెండు నెలలు పొడిగించాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బీకేఎంయూ) జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అదే సమయంలో ప్రతి అర్హ ఓటరు తప్పనిసరిగా ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొని తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వెంకట్రాములు మాట్లాడుతూ.. జూన్ 24న ప్రారంభమైన ఎస్ఐఆర్ ప్రక్రియ ఇప్పటికీ పూర్తిస్థాయిలో ముందుకు సాగలేదని, రాష్ట్ర వ్యాప్తంగా 50 శాతం మేర కూడా పూర్తి కాలేదనే సమాచారం వస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో ఉన్న దినసరి కూలీలు, వలస కార్మికులు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లడంతో ప్రక్రియలో పాల్గొనలేక పోతున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బడుగు బలహీన వర్గాలకు చెందిన అనేక మంది నిరక్షరాస్యులుగా ఉండటంతో వారికి సరైన అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. 2002 ఓటర్ల జాబితాలో పేర్లను గుర్తించడం సాధారణ ప్రజలకు ఇబ్బందిగా మారిందని, ఇప్పటికీ చాలా మందికి ఎన్యూమరేషన్ ఫారాలు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే సమర్పించిన ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ కూడా నత్తనడకన సాగుతోందని అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పొడిగించాలని వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు కోరినా కేవలం పది రోజులే గడువు పెంచి ఆగస్టు 3తో ముగుస్తుందని ప్రకటించడం నిరాశ కలిగించిందన్నారు. ప్రస్తుతం తెలంగాణలో ఎలాంటి ఎన్నికలు లేకపోవడంతో తొందరపాటుగా ప్రక్రియను పూర్తి చేయాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైన రాజ్యాంగబద్ధ హక్కు అని, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రతి పౌరుడికి కల్పించిన ఈ హక్కును పరిరక్షించడం ఎన్నికల సంఘం బాధ్యత అని వెంకట్రాములు అన్నారు. చనిపోయిన వారి పేర్లు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన ఓట్లను తొలగించడం అవసరమే అయినప్పటికీ, అర్హత కలిగిన ఒక్క ఓటు కూడా తొలగిపోకుండా ఎన్నికల సంఘం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

బీఎల్ఓలు, సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టి ప్రతి అర్హ ఓటరికి ఎన్యూమరేషన్ ఫారాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఎస్ఐఆర్ ప్రక్రియను మరో రెండు నెలలు పొడిగించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కొనసాగించేలా ప్రభుత్వం, ఎన్నికల సంఘం చర్యలు చేపట్టాలని వెంకట్రాములు విజ్ఞప్తి చేశారు.

# చరిత్రను తెలుసుకోవడం.. వారసత్వ సంపదను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత

- అడుగడుగునా వారసత్వం--2.0' ప్రదర్శనలో పాల్గొన్న వరంగల్ ఎంపీ
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య






**కరపత్రం ప్రతినిది బ్యూరో, జూలై 18**

చారిత్రక, సాంస్కృతిక వారసత్వ సంపదను కాపాడుతూ భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. శనివారం ఖాజాగూడలోని మహాలక్ష్మి కోర్ట్‌యార్డ్‌లో నిర్వహించిన 'అడుగడుగునా వారసత్వం--2.0' ప్రదర్శనకు ఎంపీ డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన చారిత్రక గ్రామాలు, దేవాలయాలు, శాసనాలు, పురాతన కట్టడాలు, పురావస్తు ప్రదేశాలకు సంబంధించిన అరుదైన చారిత్రక విశేషాలను ఎంపీ ఆసక్తిగా పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ.. మన పూర్వీకులు అందించిన అపూర్వమైన చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించి భావితరాలకు అందించడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. చరిత్రను అధ్యయనం చేయడం ద్వారా సమాజం తన మూలాలను, సంస్కృతిని, నాగరికత వికాసాన్ని మరింత లోతుగా అర్థం చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఇటువంటి ప్రదర్శనలు యువతలో చరిత్రపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు వారసత్వ పరిరక్షణ పట్ల బాధ్యతను పెంచుతాయని తెలిపారు. ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ చేపడుతున్న 'భావితరాల కోసం వారసత్వ పరిరక్షణ' కార్యక్రమం ద్వారా మరుగునపడిన ఎన్నో చారిత్రక, పురావస్తు విశేషాలను వెలుగులోకి తీసుకువస్తున్న ఫౌండేషన్ ప్రధాన కార్యనిర్వాహక అధికారి డాక్టర్ ఈ. శివనాగిరెడ్డి సేవలను ఎంపీ ప్రత్యేకంగా అభినందించారు. చారిత్రక సంపదను గుర్తించి, దాని విశిష్టతను ప్రజలకు చేరవేస్తూ వారసత్వ పరిరక్షణకు విశేష కృషి చేస్తున్నందుకు ఆయనను కొనియాడారు. అనంతరం డాక్టర్ ఈ. శివనాగిరెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో చరిత్రాభిమానులు, పరిశోధకులు, విద్యార్థులు, సాంస్కృతిక రంగ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల అభ్యున్నతే దేశ ప్రగతికి బాట: బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ ముఖేష్ శర్మ

- వరంగల్‌లో ఘనంగా కిసాన్ దివస్ అభినందన కార్యక్రమం
- మహిళా సంఘాలకు చెక్కుల పంపిణీ
- సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచన



**కరపత్రం ప్రతినిది వరంగల్, జూలై 18**

రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని, రైతుల అభ్యున్నతే దేశ ప్రగతికి బాట అని బ్యాంక్ ఆఫ్ ఇండియా హెడ్ ఆఫీస్ జనరల్ మేనేజర్ ముఖేష్ శర్మ అన్నారు. శనివారం బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఖిలా వరంగల్‌లోని దీపు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కిసాన్ దివస్ అభినందన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వ్యాపార, వ్యవసాయ, గృహ నిర్మాణ, వాహన, విద్యా రుణాలతో పాటు అన్ని రకాల రుణాలను వేగవంతంగా అందించేందుకు బ్యాంక్ ఆఫ్ ఇండియా నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. రైతుల సంక్షేమం, సుస్థిర వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి కోసం బ్యాంక్ అమలు చేస్తున్న పథకాలు, సేవలను రైతులకు చేరవేసే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో 120 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఖాతాదారుల విశ్వాసంతో మరింత అభివృద్ధి సాధిస్తూ దేశ ఆర్థిక పురోగతిలో కీలక పాత్ర పోషిస్తోందని ఆయన అన్నారు. అలాగే బ్యాంకు పేరుతో సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసినా లేదా సందేశాలు పంపినా ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీ, బ్యాంకు వివరాలు ఎవరికీ వెల్లడించవద్దని ఖాతాదారులకు సూచించారు. ఈ సందర్భంగా మహిళా స్వయం సహాయక సంఘాలకు చెక్కులను పంపిణీ చేసి ప్రోత్సహించారు. ఖాతాదారులకు నాణ్యమైన, వేగవంతమైన బ్యాంకింగ్ సేవలు అందించేందుకు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా తెలంగాణ జోనల్ మేనేజర్ ముఖేష్ కుమార్, డిప్యూటీ జనరల్ మేనేజర్ తుషార్ కాంత్ ఝా, డిప్యూటీ జోనల్ మేనేజర్ కళ్యాణ్ చక్రవర్తి, ఎఫ్‌బీఓఐఓఏ అధ్యక్షుడు గాలేటి నాగేశ్వర్, ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ అసోసియేషన్ నాయకులు లావుడ్య రాజేందర్, ఉదయ్ దారావత్, శశికాంత్, సీనియర్ బ్రాంచ్ మేనేజర్ బి. రాజేష్, బ్యాంకు మేనేజర్లు గోపీకృష్ణ, భూక్యా తారాచంద్, రాజేష్, ఫీల్డ్ ఆఫీసర్లు, సిబ్బంది, ఖాతాదారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# టీఆర్ఎస్‌లోకి బోథ్ నియోజకవర్గ ఆదివాసీ నాయకులు




**కరపత్రం ప్రతినిది బ్యూరో, జూలై 18**

బోథ్ నియోజకవర్గంలో బీఆర్ఎస్, బీఎస్పీ లకు షాక్ తగిలింది. ఆ పార్టీ లోని ఆదివాసీ సీనియర్ నాయకులు టీఆర్ఎస్ లో చేరారు. హైదరాబాద్ లోని బంజారాహిల్స్ టీఆర్ఎస్ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో వారంతా పార్టీలో చేరారు. బోథ్ నియోజకవర్గ టీఆర్ఎస్ ఇంఛార్జ్, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు ఆధ్వర్యంలో తలమడుగు మండలానికి చెందిన ఆదివాసీ నాయకులు హైదరాబాద్ చేరుకున్నారు. పార్టీ సీనియర్ నేత రూప్ సింగ్ సమక్షంలో పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి రూప్ సింగ్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ చీఫ్ కవిత నాయకత్వం మీద విశ్వాసంతో వారంతా టీఆర్ఎస్ లోకి వచ్చారన్నారు. ఆదివాసీల అభ్యున్నతి కోసం కవిత ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టారని చెప్పారు. తెలంగాణ అస్తిత్వం, అభివృద్ధి లక్ష్యంగా టీఆర్ఎస్ పనిచేస్తుందన్నారు. టీఆర్ఎస్ సిద్ధాంతాలు, నాయకత్వంపై విశ్వాసంతో పార్టీలో చేరిన వారందరికీ రూప్ సింగ్ కృతజ్ఞతలు చెప్పారు. రానున్న రోజుల్లో బోథ్ నియోజకవర్గంలో టీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో గజన, దేవర్ల స్వామి,రమేష్, నాయిని శ్రీనివాస్, తీగల ప్రకాష్, శ్రీనివాస్ పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ విధుల్లో విశేష సేవలు.. బీఎల్‌వో రజితకు బీజేపీ ఘన సన్మానం

- 16వ డివిజన్ 142వ బూత్‌లో సన్మాన కార్యక్రమం
- ఓటరు జాబితా సవరణలో బీఎల్‌వోల సేవలు అభినందనీయమన్న బిజెపి నాయకులు



**కరపత్రం ప్రతినిది వరంగల్ జూలై 18**

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో గత నెల రోజులుగా అంకితభావంతో విధులు నిర్వహించిన బీఎల్‌వో బండారి రజిత (రాధ)ను భారతీయ జనతా పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. శనివారం 16వ డివిజన్ పరిధిలోని 142వ బూత్‌లో బీఎల్ఏ-2 బొమ్మగాని దిలీప్ కుమార్, బూత్ అధ్యక్షుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బీఎల్‌వో రజితకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించడంలో బీఎల్‌వోలు కీలక పాత్ర పోషిస్తున్నారని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమర్థవంతంగా సేవలు అందిస్తున్న రజిత సేవలు అభినందనీయమని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గట్టికొప్పుల రాంబాబు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు గోదాసి అశ్విని కుమార్, 16వ డివిజన్ అధ్యక్షుడు జాలిగాపు ప్రసన్న రాంప్రసాద్, బీజేపీ జిల్లా నాయకుడు బైకని వెంకటేష్, డివిజన్ ప్రధాన కార్యదర్శి సంకతల శ్రీనివాస్, డివిజన్ నాయకుడు సురేష్తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గోషామహల్ నియోజకవర్గం నుండి యువ సంగ్రామ సభకు బయలుదేరిన బిఆర్ఎస్ శ్రేణులు





**కరపత్రం ప్రతినిది హైదరాబాద్, జూలై 18**

నిరుద్యోగుల సమస్యలను కాంగ్రెస్ సర్కార్ దృష్టికి తీసుకువచ్చేందుకు బి ఆర్,ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నేడు సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో చేపట్టిన "యువ సంగ్రామ సభకు" గోషామహల్ నియోజకవర్గం లోని జాంబాగ్ డివిజన్ నుండి, బి ఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎం అనిల్ కుమార్ నేతృత్వంలో, గోషామహల్ నియోజవర్గం సభ్యత్వ నమోదు ఇంచార్జి, జి నరేందర్ గౌడ్, ఆశిష్ కుమార్ యాదవ్,నియోజవర్గం ఇన్చార్జి ఆర్, వి మహేందర్ కుమార్, ఆదేశాల మేరకు అబిడ్స్ రామకృష్ణ థియేటర్ నుండి, పలు కార్లలో వందనాలు మంది, బి ఆర్ఎస్ కార్యకర్తలతో, జై కేసీఆర్ జై,, జై కేటీఆర్ అంటూ నినాదాలు చేస్తూ, తరలి వెళ్లారు, ఈ సందర్భంగా బి ఆర్ఎస్ నాయకులు ఏం అనిల్ కుమార్ మాట్లాడుతూ,,,, ఈ యువ సంగ్రామ సభలో బి ఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్లు, నిరుద్యోగ యువత సమస్యలు, ఉపాధి అవకాశాలు, ఉద్యోగ కల్పన, యువత భవిష్యత్తుకు సంబంధించిన అంశాల పైన, నిర్వహిస్తున్న ఈ ముఖ్య కార్యక్రమానికి, నగరవ వ్యాప్తంగా పెద్ద ఎత్తున టిఆర్ఎస్ కార్యకర్తలు యువత పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అనిల్ కుమార్ కోరారు, ఈ కార్యక్రమంలో, బి ఆర్ఎస్ సీనియర్ నాయకులు, విష్ణువర్ధన్, రాము, నరేందర్ యాదవ్, అంజన్ కుమార్, సాయిబాబా, సురేష్, గణేష్, నిఖిల్ కుమార్, పప్పా, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సరస్వతీ శిశు మందిర్ కరీంనగర్ పాఠశాలలో ఘనంగా ఆషాడ మాసం బోనాలు



**కరపత్రం ప్రతినిధి కరీంనగర్**
శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఇ. మీ హైస్కూల్, కరీంనగర్‌లో ఆషాఢ మాసపు ముందస్తు బోనాల వేడుకలను శనివారం భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో అలంకరించుకొని తలపై బోనం ఎత్తుకొని, విద్యార్థులు పోతు రాజుల వేష ధారణలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం పూలతోరణాలు, మామిడి ఆకులతో అందంగా అలంకరించబడింది. పాఠశాల ప్రదానాచార్యులు మోర రణధీర్ బోనాల పండుగ విశిష్టతను, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్ కోల అన్నారెడ్డి, ఎలగందుల సత్యనారాయణ, గట్టు శ్రీనివాస్ మరియు ఆచార్యుల బృందం ఉత్సాహంగా పాల్గొని వేడుకను విజయవంతం చేశారు.

## 10వ డివిజన్‌లో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరపత్రం ప్రతినిధి కరీంనగర్**
నగరంలోని 10వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ సౌగాని కొమరయ్య ఆధ్వర్యంలో అపోలో హాస్పిటల్ వారి సహకారంతో నిర్వహిస్తున్న ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రజలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఇటువంటి ఉచిత ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని అవసరమైన వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడంలో ఇటువంటి ఆరోగ్య శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. అనంతరం నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ , డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు ఆరోగ్య పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచనలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్ సౌగాని కొమరయ్య, అపోలో హాస్పిటల్ వైద్యులు, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

## దుర్గాభవానీ అమ్మవారికి క్యాప్సికమ్ మాలలతో అలంకరణ

విశేష హారతులు, ప్రత్యేక పూజలు



**కరపత్రం ప్రతినిధి కరీంనగర్**
కరీంనగర్ నగునూర్‌లోని శ్రీదుర్గాభవానీ ఆలయంలో జరుగుతున్న ఆషాడమాసం శాకంబరీ ఉత్సవాలలో భాగంగా నాలుగవ రోజైనా శనివారం శ్రీదుర్గాభవానీ అమ్మవారిని క్యాప్సికమ్ మాలలతో అలంకరించారు. అమ్మవారికి ఆలయ ప్రధానార్చకులు పవనకష్ణ శర్మ విశేష హారతులు, ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ పూజల్లో ఆలయ ఫౌండర్ చైర్మెన్ వంగల లక్ష్మన్, ఆలయ కమిటి సభ్యులతోపాటు భక్తులు పాల్గోన్నారు.

## పిడుగురాళ్లలో హైస్కూల్లో స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

**కరపత్రం ప్రతినిధి పిడుగురాళ్ల, జూలై 18 :**




ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో శుభ్రత, పారిశుద్ధ్యం, పర్యావరణ స్థిరత్వమే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర " కార్యక్రమంలో భాగంగా గురజాల నియోజకవర్గం పిడుగురాళ్ల పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు "స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" (చెత్త రహిత పరిపాలన) " కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పరిసరాలను మునిసిపల్ కార్మికులతో కలిసి శుభ్రం చేశారు. ఆనంతరం ప్రతీ ఒక్కరు తాము నివాసం వుండే పరిసరాలను పరిశుభ్రం చేయటం కోసం నెలలో ఒకరోజు కేటాయించి పరిసరాలను శుభ్రం పరుచుకుని అనారోగ్య సమస్యల బారిన పడకుండా చూసుకోవాలని యరపతినేని సూచించారు. ఈ సందర్భంగా విచ్చేసిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు "స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర " ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు కూటమి నాయకులు, మున్సిపల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భగవద్గీత జ్ఞాన మందిరంలో యంసాని రవీందర్ దంపతులు అన్నప్రసాద వితరణ..

శ్రీకృష్ణుని అనుగ్రహం ఎల్లవేళలా ఉండాలని భక్తుల ఆకాంక్ష

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జూలై 18:**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని భగవద్గీత ధ్యాన మందిరంలో శనివారం నిర్వహించిన నారాయణ సేవ కార్యక్రమం భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా యంసాని రవీందర్--శ్రీమతి దంపతుల ఆధ్వర్యంలో ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని భక్తి, సేవాభావాలతో నిర్వహించారు. ప్రతి శనివారం నిర్వహించే నారాయణ సేవలో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీమన్నారాయణుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులందరికీ అన్నప్రసాదాన్ని వడ్డించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు సేవా భావంతో నిర్వహించిన అన్నదానాన్ని అభినందిస్తూ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. "అన్నదానం మహాదానం" అనే భారతీయ



సనాతన సంప్రదాయాన్ని ఆచరిస్తూ యంసాని రవీందర్ దంపతులు చేపట్టిన ఈ సేవ ఆదర్శప్రాయమని పలువురు ప్రశంసించారు. భగవద్గీత ధ్యాన మందిరంలో నిరంతరంగా కొనసాగుతున్న నారాయణ సేవ ద్వారా భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యం, సేవా దృక్పథం మరింత పెంపొందుతోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా యంసాని రవీందర్ దంపతులు మాట్లాడుతూ, భగవంతుని అనుగ్రహంతో



ఈ సేవ చేసే అవకాశం లభించడం తమ అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో దాతృత్వాన్ని, మానవతా విలువలను పెంపొందిస్తాయని అన్నారు. కార్యక్రమం ముగింపులో యంసాని రవీందర్ దంపతులు, వారి కుటుంబ సభ్యులపై శ్రీకృష్ణ భగవానుని కృపాకటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుఖశాంతులు ప్రసాదించాలని భక్తులు, ఆలయ నిర్వాహకులు మనస్ఫూర్తిగా ప్రార్థించారు.

# మరణానంతరం ఇద్దరి జీవితాల్లో వెలుగు నింపిన ఆకినపల్లి వెంకటలక్ష్మి.. నేత్రదానంతో మహోన్నత సేవ

జమ్మికుంటలో సదాశయ ఫౌండేషన్ చొరవతో నేత్రాల సేకరణ -- వాసన్ ఐ బ్యాంక్‌కు తరలింపు -- కుటుంబ సభ్యుల సేవాభావానికి ప్రశంసలు

**జమ్మికుంట, జూలై 18 కరపత్రం ప్రతినిధి**
"నేత్రదానం మహాదానం" అనే సందేశాన్ని ఆచరణలో చూపిస్తూ, కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని పాత గ్రేయిన్ మార్కెట్ రోడ్‌కు చెందిన కీర్తిశేషులు ఆకినపల్లి వెంకటలక్ష్మి (70) మరణానంతరం కూడా ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగులు నింపారు. ఆమె నేత్రదానం చేయడంతో ఇద్దరు దృష్టి కోల్పోయిన వ్యక్తులకు చూపు లభించే అవకాశం కలిగింది. శనివారం (జూలై 18) ఉదయం గుండెపోటుతో ఆకినపల్లి వెంకటలక్ష్మి కన్నుమూశారు. ఈ విషయం తెలిసిన ఎలిమిళ్ల రాజేంద్రప్రసాద్ సమాచారంతో సదాశయ ఫౌండేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు మచ్చగిరి నరహరి, డీలర్ గర్రెపల్లి వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను కలిసి నేత్రదానం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. వారి అవగాహనతో కుటుంబ సభ్యులు వెంటనే నేత్రదానానికి అంగీకరించారు. అనంతరం సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, వాసన్ ఐ బ్యాంక్ టెక్నీషియన్



చందు సహకారంతో నేత్రాలను సేకరించి హైదరాబాద్‌లోని వాసన్ ఐ బ్యాంక్‌కు తరలించారు. ఈ నేత్రాలు ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగులు నింపనున్నాయి. మృతురాలి భర్త ఆకినపల్లి కాశీ విశ్వనాథ్, కుమారులు కిషోర్ కుమార్, కిరణ్ కుమార్, కోడళ్లు భాగ్యలక్ష్మి, హర్షితతో పాటు కుటుంబ సభ్యుల సేవాభావాన్ని సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు అభినందించారు. ఈ కార్యక్రమానికి సహకరించిన గర్రెపల్లి వెంకటేశ్వర్లు, చిటి కేసి శివానందయ్య, ముత్యాల జగదీశ్వర్, చిదురాల శ్రీనివాస్, వంగల రమేష్‌లకు సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు



శ్రవణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, జాతీయ కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి, జిల్లా అధ్యక్షుడు మచ్చగిరి నరహరి, ముఖ్య సలహాదారు నూక రమేష్, గౌరవ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ప్రచార కార్యదర్శి వాసు, లగిశెట్టి చంద్రమౌళి తదితరులు అభినందనలు తెలియజేస్తూ కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

# 100 శాతం ఫలితాల లక్ష్యంతో ఇల్లందకుంట జడ్పీ పాఠశాల.. తల్లిదండ్రులు--ఉపాధ్యాయుల సమావేశం

క్రమశిక్షణ, నాణ్యమైన విద్య, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి -- ప్రైవేట్ పాఠశాలల నుంచి కూడా అడ్మిషన్లు పెరుగుతున్నాయని ప్రధానోపాధ్యాయులు వెల్లడి

**ఇల్లందకుంట, జూలై 18 కరపత్రం ప్రతినిధి**
ఇల్లందకుంట మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం తల్లిదండ్రులు--ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సుమారు 25 మంది విద్యార్థుల తల్లిదండ్రులు హాజరై విద్యార్థుల విద్యాభివృద్ధి, క్రమశిక్షణ, పరిశుభ్రత తదితర అంశాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తస్మిన్ నజ్మీన్ మాట్లాడుతూ, గత 2025--26 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 47 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరై 100 శాతం ఉత్తీర్ణత సాధించడం పాఠశాలకు గర్వకారణమని తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 48 మంది విద్యార్థులు ఉన్నారని, వారందరూ అత్యుత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయ బృందం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని చెప్పారు. ఇందుకు తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరమని, విద్యార్థులను ప్రతిరోజూ క్రమం తప్పకుండా



పాఠశాలకు పంపించడంతో పాటు ఇంటి వద్ద కూడా చదువుపై పర్యవేక్షణ చేయాలని కోరారు. ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటివరకు 45 కొత్త అడ్మిషన్లు నమోదు అయ్యాయని, బడిబాట కార్యక్రమంలో గ్రామ గ్రామాన తిరిగి ఇంటింటికీ వెళ్లి విద్యార్థులను చేర్పించినట్లు తెలిపారు. జమ్మికుంటతో పాటు ఇతర ప్రాంతాల ప్రైవేట్ పాఠశాలల నుంచి కూడా 11 మంది విద్యార్థులు తమ పాఠశాలలో చేరారని, ఆగస్టు చివరి నాటికి మరో 20 వరకు అడ్మిషన్లు నమోదయ్యే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుడు కే. జయప్రకాష్ మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించేలా తల్లిదండ్రులు ఇంటి వద్ద అనుకూల వాతావరణం కల్పించాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకంలో ఉన్న స్వల్ప సమస్యలను త్వరలోనే



పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సమావేశంలో విద్యార్థుల చదువు, వ్యక్తిగత పరిశుభ్రత, పాఠశాల అభివృద్ధి తదితర అంశాలపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చర్చించారు. ఈ సందర్భంగా ఎనిమిదో తరగతి విద్యార్థిని కుమారి నిడిదొడ్డి శృతి రూపొందించిన జీవశాస్త్ర నమూనాను తల్లిదండ్రుల ముందుంచి ప్రదర్శించగా, ఆమె ప్రతిభకు అందరూ ప్రశంసలు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు తస్మిన్ నజ్మీన్‌తో పాటు ఉపాధ్యాయులు కే. జయప్రకాష్, సిహెచ్. వేణు, కే. సత్యనారాయణ, జి. అన్నపూర్ణ, ఏ. సురేష్, సిహెచ్. రామకృష్ణ, కే. శంకర్, రాధికా రాణి, ఎం. ఐలయ్య, డి. పరమేశ్వర్, స్రవంతి, దేవేందర్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ వేదం ఉన్నత పాఠశాలలో వన మహోత్సవం

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్**
లక్ష్మీపురం లోని శ్రీ వేదం ఉన్నత పాఠశాలలో ఈరోజు గో గ్రీన్ పేరుతో వనమాత్సవం చాలా ఘనంగా నిర్వహించారు విద్యార్థిని విద్యార్థులు పాఠశాల ఆవరణని పచ్చదనంతో అలంకరించి ప్రతి విద్యార్థి ఆకుపచ్చ డ్రస్సులతో వచ్చి చెట్ల పెంపకం వాటి ఉపయోగాల పై చక్కగా నృత్య రూపంలో వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ బొమ్మ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ చెట్ల పెంపకం యొక్క ఆవశ్యకతను వివరిస్తూ ప్రస్తుతం వాతావరణంలో జరుగుతున్న మార్పులు వాటి యొక్క నివారణ చర్యల గురించి విద్యార్థిని విద్యార్థులకు చక్కగా వివరించారు.



ప్రతి విద్యార్థి తన పుట్టినరోజులకు కేకులు కట్ చేయకుండా మొక్కలు నాటాలని ప్రతి ఇల్లు పచ్చదనంతో ఉండేలా చూసుకోవాలని విద్యార్థులతో




ప్రమాణాలు చేపించారు . ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొని ఘనవిజయం చేశారు.